# చెప్పులు కుట్టేవాడు

నన్ను మీరు చూసే వుంటారు. కాని నేను మీకు గుర్తు వుండను. మీరు ఎన్ని రాళ్ళనూ రప్పలనూ చూడటం లేదు! అవన్నీ మీకు గుర్తు వుంటున్నయ్యా? వుండవు. అదే విధంగా నేనూ మీకు గుర్తు వుండను. నాతో మీకు పని లేదా అంటే వుంటుంది. రాయితో మాత్రం మీకు పని వుండదూ ? వుంటుంది. మేకు ఏ గోడనో కొట్టవలసి వస్తుం దనుకోండి. అప్పుడు ప్రక్కన వున్న రాయిని తీసుకొంటారు; దిగగొడతారు. తరువాత ఆ రాయిని విసిరిపుచ్చుకొని అవతల పార వేస్తారు. ఆ రాయి మీకు ఉపయోగించింది. గనుక గుర్తు వుంటుందా ? ఉండదు. నేనూ అంతే. ఏ చెప్పో తెగితే నాతో పని చేయించుకొంటారు. కాని నేను మీకు గుర్తు వుండను. కాకపోతే పనిచేసినందుకు ఏ కానో అర్ధణో నా మీదకు విసరి పారవేసి వెళ్తారు.

నాతో పని చేయించుకునే వారితో, నాకు మాట్లాడ బుద్ధి అవుతుంది. వారి కష్టసుఖాలు కనుక్కో బుద్ధి అవుతుంది. నాకూ వారికీ తెగని సంబంధం ఏదో వున్నట్లు అనిపిస్తుంది. కాని వారు పడనిస్తేనా !

"చెప్పుల మడమలు బాగా అరిగిపోయినాయ్ బాబు గారు," అనే వాణ్ణి. ఎందుకనో వారు విననట్టే నటించేవారు. మొహం అటు వైపుకి తిప్పుకునేవారు.

"మడమ వేస్తా బాబూ, లేకపోతే కాలు దెబ్బ తింటుంది" అనేవాణ్ణి.

"చెప్పినపని చెయ్యవాయ్," అనేవారు.

"అట్లాగే బాబూ," అని వారు అడిగినట్లు ఉంగటం వేసిఇచ్చేవాణ్ణి. కానివారు బజార్న నడుస్తూ కనపడినప్పుడల్లా మడమ వెయ్యకపోతినే అని మనస్సులో దేవుతూనే వుండేది. "ఉంగటం బాగుందా బాబూ ?" అని అడగబుద్ధి అవుతూనే వుండేది. కాని వారు అడగనిస్తేనా ? ఎరగనట్లు, మొహం అవతలికి తిప్పుకొని వెళ్ళి పోతుండేవారు. అట్లా ఎందుకు చెయ్యాలి ? నాకు అర్థం అయ్యేదికాదు. వెళ్ళనిచ్చేవాణ్ణి.

ఒకరోజు ఒకాయన చెప్పుల కాళ్ళతో ఈడ్చుకుంటూ వచ్చాడు. ఒక చెప్పు ఉంగటం తెగిపోయింది; ఒక చెప్పు, కాలిని కప్పే నడిమిభాగం లేచిపోయి వుంది. అట్లా వున్న చెప్పులు చేత్తో పట్టుకు రావటం న్యాయం. ఈ సంగతి నాకు తెలియగాలేంది - అందరికీ తెలియదా ? అందరికీ తెలుసు. కాని అలాగే చెప్పుల్ని కాళ్ళతో అతి కష్టంమీద ఈడ్చుకుంటూ వచ్చాడు. కుట్టమన్నాడు. చెప్పులు, జాతిచెప్పులు. బాగా వున్నయి. వాటిని చూడగానే నాకు మనస్సు లేచి వచ్చింది. ఎంతో జాగ్రత్తగా చక్కగా కుట్టాను. ఆయన అడక్కుండానే పాలిష్ చేశాను. ఆయన కాళ్ళ ముందు పెట్టాను. చూడ్డానికి ఎంత బాగున్నయి అనుకున్నావు! బండి లాగటానికిమువ్వలు, కుచ్చులు వేసుకొని నిలబడిన కోడెదూడ లకుమల్లే వున్నాయి. ఆయన తొడుక్కున్నాడు. ఆయనకాలు ఎక్కడ నొచ్చుతుందోనని ఉంగటానికీ, కాలిని కప్పేదానికీ

మంచి మెత్తని తోలువేసి కుట్టాను. ఆ మెత్తదనం కాళ్ళకు తెలియకుండా వుంటుందా? అనుకని, "ఎట్లా వున్నయ్యండీ," అని అడిగాను.

"ఉన్నయ్ లేవాయ్," అని ఆయన ఒక అణా విసురుగా పారవేసి వెళ్ళిపోయారు. ఎందుకంతకోపం? ఒక మంచి మాట అంటే ఆయన సొమ్మేం పోయె! అనరు.

నేను కూర్చునేది నాలుగు బజార్లూ కలిసినదగ్గర. ఒక ప్రక్కగా, జనం నడిచే దారిలో కూర్చుంటాను. అస్తమానం అక్కడే కూర్చోవలసి రావటంవల్ల, ఎండకి తట్టుకోలేక, చిన్న డేరాగుడ్డ దొరికితే, దానిని పుల్లలమీద లేపి, దానికింద కూర్చొని వుంటాను. నేను చెప్పులుబాగా కుట్టగలను. అయితే నాతో చెప్పులు మరామత్తు చేయించుకునే వారేగాని కుట్టించుకునేవారు లేరు. ఒకవేళ ఎవరన్నా కుట్టించుకుందాం అనుకున్నా నన్ను నమ్మి ముందుగా ఎవ్వరు డబ్బిస్తారు? నా దగ్గర చెప్పుకు కావలసిన పెట్టుబడి పెట్టడానికి నయాపైసా లేదు. మొట్టమొదట్లో ఎట్లాగో ఒక రూపాయి పోగుజేసి, పెద్ద షాపులవాళ్ళు, పనికిరాని తోళ్ళ తుక్కు అమ్ముతుంటే కొన్నాను. అదే నా పెట్టుబడి. ఆ తోళ్ళ తుక్కు ముందువేసుకుని కూర్చొని యాపారం మొదలు పెట్టాను. పొద్దున్నే గంజినీళ్ళు తాగివచ్చి కూచునేవాణ్ణి. నాకుమల్లే చెప్పులుకుట్టే వాళ్ళని నేను చాలామందిని చూశాను. వాళ్ళు చూట్టానికి గలీజుగా వుండటంవల్ల చెప్పులు కుట్టించుకునే పెద్దమనుష్యులు వాళ్ళదగ్గరకు వచ్చేవారు కాదు. అందుకని అందిన గుడ్డపీలికలు అన్నిటినీ చేర్చి

పొడుగ్గా కుట్టి ఒక తలగుడ్డ తయారుచేశాను. దాన్ని కాసిని ఎర్రనీళ్ళలో ముంచి కంటికి నదరుగా వుండేటట్టు చేశాను. అది చుట్టుకుని పనిలోకి వెళ్ళేవాణ్ణి. మొదటిరోజు అది తలకు చుట్టుకొని, పిల్లలు బజార్లో ఏరుకొచ్చిన అద్దం ముక్కలో చూసుకున్నాను. నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. డాబుసరిగానే వుంది. నన్ను చూసుకుంటే నాకే నవ్వు వచ్చింది. నవ్వాను తుసుక్కున.

"ఎందుకట్లా నవ్వుతావ్? నీకేమన్నా పొయ్యేకాలం వచ్చిందా?" అంది గుడిసెది.

"ఇటు చూడు" అన్నాను.

"పోతు పేరంటాలల్లే వున్నావు" అంది, అని తానూ నవ్వింది.

తల వంచుకొని నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొని మరీ నవ్వింది. అది నవ్వితే, దానినవ్వు కిర్రుచెప్పులమీద తగరం మెరిసినట్లు మెరిసేది.

నా గుడిసెది నాకు చెప్పులు కుట్టటంలోకూడా బాగా సహాయం చేసేది. నేను పొద్దున్నే పనిలోకి వెళితే అదికూడా వుడకేసి తొమ్మిది పదిగంటలకల్లా నాసరసనే జేరేది. దానికి కూడా చెప్పులు కుట్టడం కాస్త వచ్చు. ఎవ్వరు నేర్పారు? నన్నుచూచి అదే నేర్చుకుంది. అయితే పాలిష్ చెయ్యడం మాత్రం నాకన్నా బాగా చేసేది. అణిచిపెట్టి రుద్దేది. చెప్పు మీద దానిచెయ్యి పడితే చాలు; మిలమిల మెరిసపొయ్యేది.

అదివచ్చి సరసన కూర్చోగానే, పని దానికి అప్ప జెప్పి నేను కూటికిపోయేవాణ్ణి. నాకు నలుగురు పిల్లలు.

అందులో ఒకటి చటిందె. చంటి దానిని, వాళ్ళ అమ్మ ఒళ్లో నేవుంచి మిగిలినముగ్గుర్నీ తీసుకొని గుడిసెకు వెళ్ళేవాణ్ణి. వాళ్ళకు అన్నం ముద్దలుచేసి పెట్టి, నేను ఇంత తిని, మళ్ళీ పనిలోకి వచ్చి, దాన్ని కూటికి పంపేవాణ్ణి. అది తినివచ్చి నా సరసనే కూర్చొని సాయంకాలం దాకా నా సరసనే కూర్చొని, నాతోపాటు పనిచేసేది. పిల్లలు ఆ చుట్టుపక్కల ఆడుకుంటూ వుండేవారు.

నాకు ఎవ్వరన్నా భయంవుండేదికాదు; పోలీసులంటే మాత్రం భయం. ఉత్తపుణ్యానికి వచ్చేవాళ్ళు; నానా కూతలూ కూసేవాళ్ళు. చివరకి అణో బేడో పుచ్చుకు వెళ్ళే వాళ్ళు. ఒకరోజు ఒక పోలీసాయన వచ్చాడు.

"లే ఇక్కడనుంచి" అన్నాడు.

నేనూ నాగుడిసెదీ కాళ్ళా వెళ్ళాబడి బతిమాలాం. కాని ఆయన వినలేదు. "ఇక్కడ కూచోటానికి వీల్లేదు, పో!" అని అక్కడున్న తోళ్ళ ముక్కల్ని కాళ్ళతో ఇటూఅటూ తన్ని పారేశాడు. ఆ తోళ్ళ ముక్కల్ని తంతుంటే నా పిల్లల్ని తంతున్నట్టే అనిపించింది నాకు. "పో ఇక్కడనుంచి. నీఅబ్బ గాడి స్థలం అనుకున్నావా!" అని నన్ను బూటుకాలెత్తి తన్న బోయాడు. తన్నాడే అనుకున్నా. తంతే తన్నాడు;

పొమ్మంటాడు అక్కడనుంచి? ఎంత తేలిగ్గా అన్నాడు! కాని ఎక్కడకు పోను? ఎక్కడికి పోయినా ఏ స్థలమూ నాదికాదాయె! డబ్బున్న వాళ్ళకుమల్లే ఏదన్నా కొట్టు అద్దెకు తీసుకోమంటాడా! పక్క సందుల్లోకి ఎక్కడికన్నా

పొమ్మంటాడు. అక్కడికి పోతే చెప్పులు కుట్టించుకునే బాబులు ఎవ్వరు దొరుకుతారు ?

వాళ్ళమ్మ కాళ్ళు చుట్టేసుకునిపిల్లలు గొల్లునఏడ్చారు. నేనిక తట్టుకోలేక తలగుడ్డలో నుంచి ఒకపావులా డబ్బులు తీసి, "ఇంత కంటే ఇచ్చుకోలేను బాబూ," అని ఆయన చేతిలో పెట్టబోయా. అందరూ చూస్తున్నప్పుడు ఇవ్వటం తప్పనుకోలేదు.

ఆ డబ్బుచూచి ఇటూ అటూ చూచి ఆయన ఉగ్రుడై పోయాడు. "లఢ్డీకొడకా, నాకు లంచం ఇస్తా వ్రటా ?" అని బూటుకాలుతో డొక్కలో ఒక తన్ను తన్నాడు. అనుకున్నంత పనీ అయింది. నేను దూరంగా వెళ్ళి పడ్డాను. పావలా ఇవ్వబోవటం తప్పయిందట. డబ్బు ఇవ్వటం నాకు మాత్రం ఇవ్వాలని వుంటుందా ? నేను మాత్రం ఇవ్వ గలిగి ఇవ్వబోయానా ? బెదిరించటం, అణోబేడో తీసుకో వటం వాళ్ళకు రివాజేనాయె. అందుకని తప్పదనిఇవ్వబోయా. అదే తప్పయిపోయింది. డొక్క జివ్వున లాగుతూవుంది.

గుడిసెదీ పిల్లలూ ఒక్కటే ఏడుపు. గల్లంతుకి దారే పోయే వాళ్ళందరూ జేరారు. అందరూ నన్నుతిట్టేవాళ్ళే. "నాలుగు పైసలు జేరేటప్పటికి వళ్ళుబలిసింది. వీడి బతుక్కి వీడు పోలీసాయనకు లంచం ఇస్తాడా !... ...ఏంరా ! కళ్ళు నెత్తి కొచ్చినయ్యటరా ?"

"లేదు బాబూ."

"లేకపోతే నీ బతుక్కి తోడు పోలీసాయనికి లంచం ఇచ్చేదాకా వచ్చావా ? ఆయన ఎవరనుకున్నావు ? ఎంత

కరెక్టు మనిషి ! వీణ్ణి జైల్లోకి తోయించండి పోలీసుగారు, అప్పుడు గాని వీడికి బుద్ధిరాదు."

"బుద్ధి గడ్డితిన్నది బాబూ, నా తప్పు ఈసారికి కాయుండి" అని బ్రతిమాలుకున్నా... ఆయన వినలేదు. వినే వీలులేకపోయిందని, నాకు తరువాత తట్టింది. ఎవర్నని ఏం లాభం ?

తోలుముక్కలు ఏరుకొని, డేరాగుడ్డ చంకన పెట్టుకొని చెప్పులు మూట కట్టుకొని, నేనూ, గుడిసెదీ, పిల్లలూ గుడిసె దారి పట్టాం. నాలుగు రోజులు ఎవ్వరికీ మెతుకు లోపలకు పోలేదు. ఏం చేస్తాను ? ఒకటి రెండుసార్లు నేను కూర్చునే స్థలం వైపుకు వెళ్ళిచూశాను. అదిఖాళీగానే వుంది. బోరువుమంటూ వుంది. చెప్పులు కుట్టుకోవటానికి నేను గోడకు కొట్టిన మేకులు ఇంకా అక్కడే వున్నయ్. నన్నంతా మరచిపోయినట్లే వున్నారు. మరచిపోక నేను అజలోవాణ్ణా, లెక్కలోవాణ్ణా ?

మరుసటి రోజు, ఆ బజారు విడిచిపెట్టి మరొక బజార్లో కూచున్నాను. రెండుమూడు రోజులు కొత్త కొత్త అని పించింది గాని అక్కడా బాగానే వుంది. గుడిసెదీ పిల్లలూ అక్కడకు వచ్చి కూర్చునేవారు. మళ్ళీ రోజులు మామూలుగా గడిచిపోతున్నాయి. పోలీసు చేసిన పని అందరం మరచిపోయాం. కష్టపడి సంపాదించి, ఒక చెప్పులకొట్టు పెట్టాలని నేనూ గుడిసెదీ ఒక రోజు అనుకున్నాం. బజార్లో ఒక చెప్పులకొట్టు చూచినప్పుడల్లా అటువంటికొట్టు పెట్టాలని నేను ఎప్పుడూ అనుకుంటూ వుండేవాణ్ణి. ఆరోజు అందరం

సంతోషంగానిద్దరపోయాం. కొట్టు పెట్టుకుంటే నాది-అనేది ఒకటి ఏర్పడుతుంది. ఏ పోలీసు భయమూ ఉండదు. కొట్లో కూచోని గుడిసెదాన్ని సరసన కూచోబెట్టుకొని ... ఆలోచిస్తూ అట్లాగే నిద్దరపోయాను.

ఆరోజు మొదలుకొని అందరం కష్టపడి పనిచెయ్యటం మొదలుపెట్టాం. పెద్దపిల్ల కొంచెం అక్కరకు వచ్చింది. పని ఎక్కువయి గుడిసెది నాతోనే కూర్చున్నా, అది కూడు ఉడకేసి పెట్టేది. పదిరూపాయలూ వెనకవేశాం. ఇరవై రూపాయలు వెనకవేశాం. ఇంకొక నెల పదిరూపాయలు వెనకవేస్తే కొట్టు అద్దెకు తీసుకోవచ్చు - అనుకున్నాం. ఒక కొట్టు మేమున్న స్థలానికి దగ్గర్లోనే వుంది. అది అద్దెకు తీసుకొని, జేరి నెమ్మదిగా నెమ్మదిగా బేరంసాగిద్దాం అనుకున్నాం. వాడికి ఒకరోజు కాని, అన్నీ అనుకున్నట్లు సాగుతయ్యా? అందులో నా బోటివాడికి! సాగవు. ఒకరోజు గుడిసెది వచ్చి పక్కన కూర్చుంది. పాలిష్ చెయ్యవలసిన చెప్పులు వుంటే అవి తీసుకొని పాలిష్ చెయ్యటం మొదలుపెట్టింది. నా కన్ను పడింది. ఏదో కొత్తగా కనిపించింది. అది ఎట్లా పాలిష్ చేస్తుందో నాకు తెలుసు. ఇవ్వాళ ఎవరో కొత్త మనిషివచ్చి పాలిష్ చేస్తున్నట్టు అనిపించింది. నెమ్మదిగా చూశాను. దాని చేతుల్లో ఇదివరకు సత్తువ లేదు. చేతులు వణుకుతున్నాయి.

"ఏందే?" అన్నాను.

"ఏం లేదు" అంది.

దానికళ్ళు ఎర్రగా వున్నయి. మెడమీద చెయ్యివేసి చూశాను. వళ్ళు కాలతావుంది.

"జరం వచ్చిందే" అన్నాను.

"అదే పోతది" అన్నది.

కాని జరం పోలేదు. రోజు రోజుకీ ఎక్కువయింది. పైగా దగ్గు, పట్టిపొడిదగ్గు. ఏవో అవీ ఇవీ నూరిపోశాను. తగ్గలేదు.

"డాక్టేరు దగ్గరకు తీసుకువెళ్తా" అన్నాను.

"వద్దు. డాక్టేరు తీసేస్తాడా ఎట్లా?" అంది.

"సూది మందిస్తే తగ్గుద్దే," అన్నాను.

"ఏ సూది మందిస్తేవచ్చింది.?" అంది.

దానికి డాక్టేరు దగ్గరికిరావటం ఇష్టంలేదు. దాని ఆలోచన నేనుకనిపెట్టాను. డాక్టేరుదగ్గరకు వస్తే కూడబెట్టిన డబ్బు అయిపోతుంది. మరి కొట్టో!! నేనుకూడా నాలుగు రోజులు పస్తాయించి చూశాను. జరం తగ్గలేదు. పొద్దున్న తగ్గినట్టుండేది; పొద్దుగూకే తలికి ఎక్కడనుంచి వచ్చిపడేదో, గుడిసంతా గోల అయిపోయింది. పిల్లల్ని ఆకట్టటం నాతరం కాలేదు. పనిమీదకు మనసే పోయేదికాదు. ఒకరోజు, కాదు గూడదని పట్టుపట్టి డాక్టేరు దగ్గరకు తీసుకుపోయా.

ఆయన బాగాపరీక్ష చేసి "వూపిరి తిత్తులు చెడి పోయినై" అన్నాడు.

"ఏందీ?"

"వూపిరితిత్తులోయ్, వూపిరితిత్తులు."

"ఎందుకు చెడిపోయినై బాబూ ?"

డాక్టేరు చెప్పాడు. తప్పు నాదే అన్నాడు. నేను ఎప్పుడూ దాన్ని దుమ్ములో కూచోబెట్టానంట. ఆ దుమ్ము ముక్కుల గుండా లోపలకు వెళ్ళి గుండెలు చెడిపోయినయ్యంట. అందులో జనం ఎక్కువగా తిరిగేచోట కూర్చోబెట్టగూడదంట. నేను దాన్ని అక్కడే కూచోబెట్టానంట. చేతులారా చేసుకున్నానంట. ఇదేం అన్యాయం? జనం లేని చోట కూర్చుంటే పొట్ట నిండేది ఎట్లా ? అప్పుడెప్పుడూ నా దగ్గరకు వచ్చి చెప్పులు బాగు చేయించుకునే వారు ముక్కుకి గుడ్డ అడ్డం పెట్టుకు వచ్చేవాళ్ళు. ఎప్పుడన్నా అయితే సరిపోతుందిగాని ఎప్పుడూ రోడ్డు పక్కన కూర్చునే మా కెట్లా కుదురుతుంది - ముక్కుకి గుడ్డ అడ్డం పెట్టుకోవటం? దుమ్ములో పుట్టాం, దుమ్ములో పెరిగాం. ఎక్కడని ముక్కుకి గుడ్డ అడ్డం పెట్టుకునేటట్టు ?

వీడైతే, ఎట్టాగయితే, గుడిసెది కాలంచేసింది. దానిజబ్బుకి ఉన్నదంతా ఖర్చుపెట్టాను. నేనూ పిల్లలం మిగిలాం. ఇక కొట్టు పెట్టాలనే ఆశలేదు నాకిప్పుడు. చచ్చేదాకా బతకటం ఒకటే మిగిలింది. అక్కడే కూర్చుని చెప్పులు కుడుతున్నా. పెద్ద పిల్లవచ్చి కూర్చుని నాకు తోడుపడుతూ వుంటుంది. అది అచ్చుగా వాళ్ళ అమ్మలాగే పాలిష్ చేస్తుంది. అప్పుడప్పుడూ రోడ్డుమీద రేగే దుమ్ము జ్ఞాపకం వచ్చి గుండె గభేలుమంటుంది. కాని ఏంచెయ్యను ? దుమ్మునుదాటి ఎక్కడికి పోయేటట్టు ? దుమ్ములో పుట్టాం, దుమ్ములో పెరిగాం, దుమ్ములోనే చస్తాం.